క్లుప్తంగా

రేపు ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

రాజంపేట టౌన్: ఎన్టీఆర్‌జిల్లా పొన్నవరంలో మార్చి ఒకటో తేదీ నుంచి జరిగే ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ అండర్-14 బాలుర, బాలికల ఫెన్సింగ్ పోటీలకు సోమవారం రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని ఫెన్సింగ్ టెక్నికల్ డైరెక్టర్ రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 14 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు ఇచ్చిన గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6301979079, 9490863917 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య



నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్

లక్కిరెడ్డిపల్లి: అన్నదాతలకు వ్యవసాయ సేవలను సులభతరం చేసి మరింత పారదర్శకంగా అందించేందుకు ప్రతి రైతుకూ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య అందుబాటులోకి తీసుకురానున్నారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్ తెలిపారు. శనివారం మండలంలోని కోనంపేట, దిన్నెపాడులో నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. చంద్ర నాయక్ మాట్లాడుతూ వెబ్ ల్యాండ్‌లో పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రాల్లో రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు.ఏఓ రమేష్ బాబురావు, ఏఈఓ అనూష, సహాయకులు పవన్ పాల్గొన్నారు.

నివాళి

రాజంపేట టౌన్: మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన నారాయణమ్మ మృతి చెందడంతో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి శనివారం ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు పృథ్వీరెడ్డి, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, రేవరాజు శ్రీనివాసులురాజు, దండు గోపి, పెంచలయ్య, జీవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు.. రేనాటి సూర్యుడు

'ఉయ్యాలవాడ'కు నివాళులర్పించిన నాయకులు, విద్యార్థులు



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సంబేపల్లె : 1857 నాటి మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామానికి పదేళ్లముందే బ్రిటీష్ దుష్టపాలనను ఎదిరించి తిరుగుబాటు చేసిన విప్లవ వీరుడు, రేనాటి సూర్యుడు అని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి కొనియాడారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల శనివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగాన్ని, ఆయన పోరాట పటిమని విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉయ్యాలవాడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి

రైల్వేకోడూరు అర్బన్: పట్టణంలోని అంకాళమ్మనగర్‌లో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి మందల నాగేంద్ర ఆధ్వర్యంలో శనివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ పౌరుషానికి ప్రతీక ఈ రేనాటి వీరుడు నరసింహారెడ్డి అని కొనియాడారు. తెల్లదొరల దాష్టీకాన్ని ఎదురించి పోరాడిన తొలితరం యోధుడని ప్రశంసించారు. సర్పంచ్ శివయ్య, రత్తయ్య, పురుషోత్తం, పవన్, వాసాబాబు, హరి, రాంబాబు, శ్రవణ్ పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



భూముల రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ

లక్కిరెడ్డిపల్లి: ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేతో భూ యజమానులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని దిన్నెపాడు గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామంలో ప్రైవేటు భూములతోపాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరులు గల భూములు, పోరంబోకు భూములను కొలతలు వేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేస్తారన్నారు. తద్వారా రైతులకు, భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందన్నారు. రైతుల సమక్షంలోనే భూమి కొలతలు కొలిచి హద్దులు నిర్ణయిస్తారన్నారు. రీ సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడుగగా.. సర్వే సక్రమంగా జరుగుతుందని రైతులు సమాధానం చెప్పడంతో ఆర్డీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. రీసర్వే డీటీ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న, మండల సర్వేయర్ మదన్మోహన్‌రెడ్డి, వీఆర్‌ఏ షేక్ ఇమ్రాన్ బాషా పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన 'కూటమి'

రాయచోటి అర్బన్: కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర విమర్శించారు. శనివారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సంక్షేమబోర్డును పునరుద్ధరించాలని సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికులందరూ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం వెంటనే ఇంటి పట్టాలను మంజూరుచేసి పక్కాగృహాలను నిర్మించి ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి వెంకటరమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు నరసింహులు, హుస్సేన్, వీరభద్రయ్య, మల్లిఖార్జున, రాజు, మున్నా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



ఆకేపాటిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఒంటిమిట్ట: పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, పంచాయతీ వింగ్ అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. శనివారం రాజంపేట మండలంలోని ఆకేపాడులో వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని వారు కలిసి ఘనంగా సత్కరించారు. ఆకేపాటితో పాటు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొండమాచుపల్లి సర్పంచ్ శివ నారాయణ, మల్లిరెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

టక్కోలు శివారెడ్డిని ఒంటిమిట్ట మండల అధ్యక్షుడిగా నియమించడానికి సహకరించిన రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డిని శనివారం కడప విమానాశ్రమంలో శివారెడ్డి కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

సుండుపల్లె : వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా గ్రీవెన్స్ సెల్ వింగ్ అధ్యక్షుడిగా మానెం సంతోష్‌కుమార్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మండల సమావేశం వాయిదా

సిద్దవటం: సిద్దవటం మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. సిద్దవటం మండల పరిషత్ సభా భవనంలో శనివారం ఎంపీడీఓ మాట్లాడుతూ మండల సమావేశానికి ఎంపీపీతో కలిసి ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. సభను నిర్వహించేందుకు కోరం ఉండాలంటే నలుగురు ఎంపీటీసీలు హాజరు కావాల్సిఉందన్నారు. దీంతో మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశామని పేర్కొన్నారు. సభ్యులందరికీ మరోసారి మండల పరిషత్ సమవేశానికి సంబంధించిన సర్క్యులర్‌ను జారీ చేసి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

కంటి అద్దాలు పంపిణీ

పుల్లంపేట: పుల్లంపేట ఏపీ ఆదర్శ పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. జనవరి నెలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 51 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సదరు విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ లీలా శ్రీహరిత్నం పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని ఎస్టీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టీ సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఈ. ప్రసన్నతో కలసి శనివారం తనిఖీ చేశారు. ఈ వసతి గృహాల్లో మరుగుదొడ్లు, వంట గదులు, విశ్రాంతి భవనాల్లో వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహ నిర్వహణ అధికారులకు సలహాలు, సూచనలిచ్చారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

వచ్చే నెల 8వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి కృష్ణన్ కుట్టీ కోరారు. శనివారం రాయచోటి కోర్టులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి లోక్ అదాలత్‌పై చర్చించారు. ఈ లోక్ అదాలత్ ద్వారా ప్రమాదాలు, చెక్ బౌన్స్‌లు, తగాదాలు, భూ తగాదాల వంటి కేసులను పరిష్కరించే విధంగా పోలీసులు ప్రయత్నించాలని సూచించారు.

అప్కాస్‌ను కొనసాగించాలి

రాయచోటి అర్బన్: కార్మికులు, ఉద్యోగుల ఎంపికకు ఎంతో ఉపయోగకరమైన ఆప్కాస్‌ను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆప్కాస్ రద్దు యోచనను ఉపసంహరించుకోవాలని మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం, భద్రత కోసం ఆప్కాస్‌ను ఏర్పాటు చేశారన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వి.రమణ మాట్లాడుతూ మున్సిపల్ డ్రైవర్లకు జీతం రూ.24,500 ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చిన జీఓ రాయచోటి మున్సిపాలిటీలో నేటికీ అమలుకాలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నేతలు అక్బర్, శంకరయ్య, రమణారెడ్డి, రెడ్డిశేఖర్, తిరుపాల్, వెంకటరమణ, మంగమ్మ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ముమ్మరంగా భూముల రిజిస్ట్రేషన్

పెనగలూరు: పీఎం కిసాన్‌కు రైతుల భూములను ముమ్మరంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మండలంలోని 16 పంచాయతీలలో రైతు భరోసా కేంద్రాల్లో ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు మండలంలో 3,400 మందికి భూములను రిజిస్ట్రేషన్‌ను చేసినట్లు వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. మిగిలిన రైతులు వెంటనే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. భూములను రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే పీఎం కిసాన్ నిధులు రైతుల అకౌంట్‌లో పడతాయని తెలిపారు. వ్యవసాయ భూములున్న రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రధాని మోదీ 2019లో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద ఏటా రూ.6 వేలను మూడు ఇన్‌స్టాల్మెంట్లలో రైతులకు చెల్లిస్తారు.

ఆటోలకు పోలీస్ క్రమసంఖ్య తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న పోలీసులు

సుండుపల్లె : మండల పరిధిలోని ఆటోలకు పోలీస్ క్రమసంఖ్య తప్పనిసరిగా ఉండాలని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో పలువురు ఆటోడ్రైవర్లకు గుర్తింపుకార్డు, పోలీస్ క్రమసంఖ్య పత్రాలను అందజేశారు. పోలీస్ క్రమసంఖ్య లేని ఆటో యజమానులు ఆటోకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో సమర్పించి క్రమసంఖ్య, గుర్తింపుకార్డును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సుండుపల్లె ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎస్ఐ మోహన్ నాయక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండల పరిధిలోని ఆటోలకు పోలీస్ క్రమసంఖ్య తప్పనిసరిగా ఉండాలని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలువురు ఆటోడ్రైవర్లకు గుర్తింపుకార్డు, పోలీస్ క్రమసంఖ్య పత్రాలను అందజేశారు. ఎస్ఐ మోహన్‌నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించండి

సిద్దవటం: గ్రామాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని కడప జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి సూచించారు. సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాలకు చెందిన 25 మంది పారా లీగల్ వాలంటీర్లకు న్యాయ సలహాలపై అవగాహన కార్యక్రమ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీగల్ వాలంటీర్లకు కేటాయించిన గ్రామాల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని, గ్రామాల్లో కక్షలు లేకుండా ప్రతి ఇంటికి వెళ్లి కక్షల వల్ల జరిగే నష్టాలను తెలపాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కారించుకునేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుధామణి, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ఓబులవారిపల్లె: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డీఆర్ హరిత ఆకాంక్షించారు. శనివారం చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరానికిగాను ఉత్తమ విద్యార్థినిగా ఎంపికైన శివ పార్వతికీ నగదు ప్రశంస పురస్కారం అందజేశారు. అదే విధంగా రాష్ట్రస్థాయి ఆటల పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు

దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్

రాజంపేట టౌన్: మహాశివరాత్రి సందర్భంగా జరిగే ఉత్సవాలకు జిల్లాలోని దేవదాయశాఖ పరిధిలోని శైవక్షేత్రాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవదాయశాఖ జిల్లా అధికారి సి.విశ్వనాథ్ తెలిపారు. రాజంపేట మండలంలో పవిత్ర పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న హత్యరాలలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని చేస్తున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలోని రాయచోటిలో ఉన్న శ్రీ వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో, రాజంపేట మండలంలోని కామాక్షీ త్రేతేశ్వర స్వామి, నిమ్మపల్లె మండలంలోని నీలమల్లేశ్వర స్వామి, తంబళ్లపల్లె మండలంలోని మల్లికార్జునస్వామి, రైల్వేకోడూరులోని భుజంగేశ్వర స్వామి, మదనపల్లె మండలంలోని యోగభోగేశ్వర స్వామి, సోమేశ్వర స్వామి, రామసముద్రం మండలంలోని వల్లీశ్వరస్వామి, కొత్తకోట మండలంలోని చౌలీశ్వర స్వామి, మొలకలచెరువులోని కనుగొండరాయ స్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలి వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు సాగుతున్నాయన్నారు. దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేసే అర్చకులు ఎవరైనా రాజీనామా చేసి ఉన్నా, కాలమై ఉన్నా అలాంటి వారి స్థానంలో కొత్త అర్చకుల నియామకానికి దేవదాయశాఖ జిల్లా అధికారి, జోనల్ ఉపకమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అర్చకుల ప్రతిభను త్రిసభ్య కమిటీ పరిశీలించి అర్చక పోస్టులు ఖాళీగా ఉన్న ఆలయాల్లో ప్రతిభగల వారిని నియమిస్తుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రేఖ తెలిపారు. 2025-2026 విద్యాసంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని సూచించారు. 5వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థుల వయస్సు ఓసీ/ బీసీ విద్యార్థులు అయితే 2013.09.01 నుంచి 2015.08.31 మధ్య జన్మించి ఉండాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కులానికి చెందిన వారు 2011.09.01 మధ్య నుంచి 2015.08.31 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు, ఓసీ/ బీసీ విద్యార్థులు అయితే రూ.150 చెల్లించాలని తెలిపారు.



వీరశైవుల పుణ్యక్షేత్రం.. వీరభద్రుడి ఆలయం

- దక్షిణ భారతంలో ప్రధాన శైవ క్షేత్రం
- మాండవ్య నది ఒడ్డున వెలసిన శ్రీ భద్రుడు
- వెయ్యేళ్లకు పైగా ఆలయ ప్రస్థానం
- దేవాలయాన్ని కాపాడిన వడియ రాజులకు ప్రాధాన్యత



శ్రీ వీరభద్రస్వామి ఆలయ ముఖద్వారం

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. వెయ్యేళ్లనాడు ఆలయ పునఃనిర్మాణాలు జరిగినట్లుగా ఆలయంలో ఆధారాలు కనిపిస్తాయి. అంటే అంతకు ముందుగానే ఆలయం నిర్మించినట్లుగా చారిత్రిక ఆధారాలు కూడా కనిపిస్తాయి. ఈ ఆలయం వీరశైవులకు అత్యంత ప్రాధాన్యత కలిగిన పుణ్య క్షేత్రంగా పిలివబడుతోంది.

ఆలయ చరిత్ర

కృతయుగంలో దక్షప్రజాపతి యజ్ఞాన్ని తలపెట్టి అల్లుడు అయిన శివుడిని ఆహ్వానించడు. దక్షప్రజాపతి కుమార్తె పార్వతీ దేవి తండ్రిని కోరికను కాదని శివుడిని వివాహం చేసుకొంది. దీంతో తండ్రి ప్రజాపతి కుమార్తెను ఆహ్వానించకుండా యజ్ఞం నిర్వహిస్తాడు. ఈ యజ్ఞానికి అన్ని దేశాలకు చెందిన రాజులను, సామంత రాజులను ఆహ్వానిస్తాడు. అయితే పార్వతీ దేవి తండ్రి నిర్వహిస్తున్న యజ్ఞం చూడాలని. భర్త అయిన శివుడికి నచ్చచెప్పి తన తండ్రి కాదన్నడనే నమ్మకంతో వెళ్లుతుంది. అక్కడ ఆ హోమం దగ్గర ఆమె తండ్రే అవమానిస్తాడు. ఆఅవమాన భారాన్ని భరించలేక ఈ హోమంలో దూకి ఆహుతి అవుతుంది. ఈ విషయం తన త్రినేత్రంతో చూసిన శివుడు తన జటాయువులోన ఉన్న శ్రీ వీరభద్రుడిని పంపి యజ్ఞాన్ని ధ్వంసం చేయమని ఆజ్ఞాపిస్తాడు. తండ్రి ఆజ్ఞమేరకు శ్రీ భద్రుడు ఉగ్రరూపాన్ని దాల్చి హోమాన్ని ధ్వంసం చేస్తాడు. తరువాత తండ్రి ఉగ్రరూపాన్ని ఉపసంహరించాలని కోరడంతో తన కోపాన్ని దహింపచేస్తాడు. తరువాత శైవక్షేత్రాలను సందర్శించాలని తండ్రి ఆదేశానుసారం ఉత్తర భారతదేశంలో శైవ క్షేత్రాలను సందర్శిస్తూ చివరికి మాండవ్య నది ఒడ్డున కోరలు లేని శాంతమూర్తి రూపంలో సతీసమేతంగా వెలిశారు.

రాయచోటికి ఆ పేరు ఎలా వచ్చిందంటే..

శ్రీ వీరభద్రుడికి రాయచాయుడు అనే పేరు కూడా ఉంది. ఆయన పేరుతోనే ఈ ఊరికి రాయచోటి అనే పేరు వచ్చిందనేది చరిత్ర. రాచరాయుడు వెలసిన ప్రాంతాన్ని మొదట రాచవీడుగా తదనంతరం రాచీడుగా కాల క్రమేణ రాయచోటిగా రూపాంతరం చెందిందినట్లు ఆధారాలు కనిపిస్తాయి. ఇప్పటికీ తహసీల్దార్ కార్యాయలంలో విధులు నిర్వహించే అటెండర్ భుజంపై ఉండే బిళ్లకు రాచవీడు అనే పేరు కనిపిస్తుంది.

స్వామి వారి బ్రహ్మోత్సవాల నిర్వహణ ఇలా...

స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో 11 రోజులు నిర్వహిస్తారు. వీటిలో ప్రధానం ధ్వజారోహణం నుంచి ధ్వజాఅవరోహణం వరకు నిత్యం ప్రత్యేకంగా నిర్వహిస్తారు. స్వామి వారి కల్యాణం నుంచి స్వామి వారి ఏకాంత సేవ వరకు ప్రత్యేకంగా వేదపండితులతో నిర్వహిస్తారు. వీటిలో కల్యాణం, అగ్నిగుండ ప్రవేశం, స్వామి వారికి అర్పించే మహానైవేద్యం వరకు అనేక రకాల వేడుకలు అపురూప ఘట్టాలుగా నిర్వహిస్తారు.

మహానైవేద్యం అంటే ఏమిటీ

స్వామి వారికి రోజుకు ఒక సేరు బియ్యం చొప్పున 365 రోజులకు 365 సేర్లు బియ్యం, నెలకు ఒక సేరు చొప్పున 12 నెలలకు 12 సేర్లు బియ్యంతో వండి అత్తిరాసాలు (నిప్పట్లు) అలాగే కాయకూరలు, దుంపలు, ఆకు కూరలు వంటివి సుండుపల్లెకు చెందిన వారు ప్రత్యేకంగా వండించి స్వామి వారి ఎదుట రాశి పోసి వడియ రాజులతో కొల్లగొట్టే కార్యక్రమం నిర్వహిస్తారు. దీనినే మహానైవేద్యం అంటారు.

ఈ నెల 23వ తేది నుంచి మార్చి 5వ తేది వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అలంకరణతో పాటు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు సిద్ధం చేశారు.

కనుల విందుగా..

బ్రహ్మోత్సవాల సందర్భంగా 11 రోజులు పాటు నిర్వహించే ఉత్సవాలు భక్తులకు కన్నులు విందు కానున్నాయి. రోజుకొక రూపంలో స్వామి వారు ఊరేగింపు సందర్భంగా చేపట్టే విన్యాసాలు, కళాకారుల నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకోనున్నాయి.